తొర్రూరు: ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ సంఘ నాయకులు

సర్వే చేస్తున్న టీచర్లపై ఒత్తిడి చేయొద్దు

మహబూబాబాద్ రూరల్/ గార్ల/ తొర్రూరు/ నెల్లికుదురు/ మరిపెడ/ దంతాలపల్లి, నవంబర్ 12: కులగణన సర్వే చేస్తున్న ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు ఒత్తిడి చేయవద్దని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు భిక్షపతి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రతిరోజు 15 నుంచి 20 కుటుంబాల సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఒక కుటుంబాన్ని సర్వే చేస్తే 30నిమిషాలు పడుతుందని, ఎన్యుమరేటర్లకు తోడుగా మరి కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ ఇచ్చేటప్పుడు ఒక నిబంధన, ప్రస్తుతం మరో నిబంధనలు చెప్పడం వల్ల టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, శ్రీనివాస్, రవీందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు. అదేవిధంగా గార్ల ఎంపీడీవో మంగమ్మకు టీపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి నాయక్, బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు, సంతూ, కన్నయ్య, పార్వతి, విజయ పాల్గొన్నారు. సర్వే టీచర్లపై ఎలాంటి ఒత్తిడి చేయవద్దని తొర్రూరు టీపీటీఎఫ్ సంఘ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొండం జనార్దన్, ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ మాట్లాడారు. సర్వేలో

గార్ల: ఎంపీడీవో మంగమ్మకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

టీచర్లకు అప్పగించిన కుటుంబాల మొత్తం వివరాలను సేకరించి నమోదు చేసి నిర్దేశించిన తేదీలోగా అందించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని, శిక్షణలో ఎలాంటి షరతులు లేకుండా చెప్పి ఇప్పుడు ఒత్తిడికి గురి చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు స్వామి, లింగ, సునీత, ప్రవీణ్ మార్, సతీశ్ పాల్గొన్నారు. నెల్లికుదురులో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వై యాకయ్య ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. ఒక్కో కుటుంబాన్ని సర్వే చేయడానికి సుమారుగా 40 నిమిషాలు పడుతున్నదని ఈ క్రమం రోజుకు 5,6 మాత్రమే చేయగలుగుతున్నారు. కానీ ప్రభుత్వం ఈ నెల 20 వరకు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచి ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి సంఘ శ్రీనివాస్, నాయకులు పద్మావతి, వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పో
- మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం సేకరించాలన్నారు. నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సన్న, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టోప్పో, వివిధ శాఖల జిల్లా అధికారులు మధుసూదన్‌రాజ్, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల, మరియన్న పాల్గొన్నారు. ఎస్సీ,

ఎస్టీల సంక్షేమం కోసం పనిచేస్తున్న అధికారులు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమాని కోసం జిల్లా యంత్రాంగం మొత్తం పని చేస్తున్నదని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నర్మద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యుల కోరిక మేరకు ప్రతినెలా డివిజన్ సెంటర్లలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరిస్తున్నామని, గ్రామస్థాయిలో వారిపై ఎలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏఎస్పీ చెన్నయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బయ్యారం: కొత్తపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పో

బయ్యారం: రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పో అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట, బయ్యారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, టార్పాలిన్ వంటివి అందుబాటులో ఉంచాలని, కొనుగోళ్లలో జాప్యం లేకుండా సకాలంలో కాంటా వేయాలని సూచించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏవో రాంజీ నాయక్, సొసైటీ సిబ్బంది సతీశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సిబ్బందిపై ఆగ్రహం

గార్ల: మండలంలోని సత్యనారాయణపురంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టోప్పో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఒక్క ధాన్యం బస్తా కూడా కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని తెలిపారు. ఎంపీడీవో మంగమ్మ, డీటీ సుధాకర్, ఆర్ఐ స్వప్న ఉన్నారు.

నెల్లికుదురులో ఆర్డీవో గణేశ్ పరిశీలన

నెల్లికుదురు: ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తొర్రూరు ఆర్డీవో గణేశ్ అన్నారు. కాచికల్‌లో మండల మయూరి సమాఖ్య, రామన్నగూడెంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కే రాజుతో పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లర్లకు తరలించాలన్నారు. రికార్డులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. తెలిపారు.

రామన్నగూడెంలో కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న తొర్రూరు ఆర్డీవో గణేశ్

కారు, బైక్ ఢీ.. తల్లీకొడుకు మృతి

వడ్డేకొత్తపల్లి శివారులో ఘటన

మృతి చెందిన వెంకన్న, శాంతమ్మ(ఫైల్)

పెద్దవంగర, నవంబర్ 12: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో తల్లీకొడుకు మృతిచెందిన ఘటన మండలంలోని వడ్డేకొత్తపల్లి శివారులో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గంట్లకుంట్ల గ్రామం అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోత్ వెంకన్న(54), తల్లి శాంతమ్మ (72)తో కలిసి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం, జలాల్‌పురం గ్రామానికి చెందిన బంధువుల ఇంటికి ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో వడ్డేకొత్తపల్లి శివారులోని వలిగొండ-తొర్రూరు ప్రధాన రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు స్పీడ్‌తో ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వారు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను తొర్రూరు దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

నిందితుడికి ఏడాది జైలు, జరిమానా

డోర్నకల్, నవంబర్ 12: మహిళపై దాడి చేసిన నిందితుడికి మేజిస్ట్రేట్ ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు డోర్నకల్ సీఐ భూక్యా రాజేశ్ తెలిపారు. పెరుమాండ్ల సంకీస గ్రామానికి చెందిన బత్తుల నరేశ్ 2019 ఏప్రిల్ 14న అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి, దుర్భాషలాడి కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్యామ్‌సుందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. 9 మంది సాక్షులను విచారించగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలత తమ వాదనాలు వినిపించారు. అనంతరం మేజిస్ట్రేట్ టీ తిరుపతి నేరస్తుడు బత్తుల నరేశ్‌కు ఏడాది జైలు, రూ.2వేల జరిమానా విధించారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

గార్ల, నవంబర్ 12: విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. అంబేద్కర్ నగర్‌కు చెందిన సింగ్ ప్రేమ్‌కుమార్ పాడి గేదె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వైపు మేతకు వెళ్లింది. విద్యుత్ షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కురవి: ముత్తయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యానాయక్

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కురవి/మరిపెడ, నవంబర్ 12: మండలంలోని బలపాల గ్రామానికి చెందిన బత్తుల ముత్తయ్య(73) అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం అతడి మృతదేహంపై పూలమాల వేసి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నామ సైదులు ఉన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఖాసీం మంగళవారం మృతి చెందగా, అతడి పార్థివదేహంపై మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్యాధికారి రవికుమార్ ఉన్నారు.

'స్టేట్‌లెవల్ కరాటే'లో క్రీడాకారుల ప్రతిభ

క్రీడాకారులను అభినందిస్తున్న వుషు సిస్టర్స్ అకాడమీ మాస్టర్స్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: పట్టణానికి చెందిన క్రీడాకారులు హైదరాబాద్‌లోని హస్తినాపురం భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్టేట్ లెవల్ కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. చిర్రగోని తేజ్‌ధీర్ దావుష్ విభాగంలో బంగారు పతకం, శ్రీరామ్, ఉదయశ్రీ ఫ్లెక్సిబిల్ సాఫ్ట్‌వేషన్‌లో వెండి పతకం, మదీనాకు సాంషో విభాగంలో వెండి పతకం సాధించినట్లు వుషు సిస్టర్స్ అకాడమీ మాస్టర్స్ ఆయేషా తస్నీమ్, సోహ తబుస్సుం కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

కురవి, నవంబర్ 12: మహిళలను లక్షాధికారి చేస్తామని చెబుతున్న పాలకులు తొలుత వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని, మహిళా సాధికారతకు చర్యలు తీసుకోవాలని, మద్యాన్ని నిషేధించి, అశ్లీల సాహిత్యాన్ని, సమాచార వ్యవస్థను అరికట్టి, స్త్రీకి రక్షణ కల్పించాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పద్మ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి, ఏపూరి లతాదేవీ మాట్లాడారు. మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణం, స్త్రీ విముక్తి కోసం పోరాటాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, మండల కార్యదర్శి కరణం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫాతిమా, యాకమ్మ, పద్మ, లక్ష్మి, రాణి, మాలి, హలిమ, మాధవి, భాగ్యమ్మ, రాజన్న, ఉపేంద్ర, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏల సంఘం సభ్యులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట వీవోఏల ఆధ్వర్యంలో ధర్నా చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతా ల్లో మహిళా సాధికారత కోసం ప్రభుత్వ పథకాల అమలులోనూ వీవోఏలు నిరంతరం పని చేసి కీలక పాత్ర పోషించారని తెలిపారు. వీవోఏలకు రూ. 20వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటీవ్‌లు, వేతనాలను విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెలిశాల సుధాకర్, నీలం కృష్ణవేణి, ఆకుల వసంత, హన్మంతు, అనిత, మంజుల, మనోహర్ పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీ అందిస్తున్న రవికుమార్

పాఠశాలకు టీవీ వితరణ

కురవి, నవంబర్ 12: ప్రముఖ డాక్టర్ దేవులపల్లి కేశవరావు సైక్రియాటిస్ట్ ప్రోత్సాహంతో ప్రాథమిక పాఠశాల బలపాల హెచ్ఎం తేలుకుంట్ల సునీత అభ్యర్థన మేరకు బలపాలకు చెందిన, పూర్వ విద్యార్థి, ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న హార్డ్‌వేర్ ఇంజినీర్ కొప్పుల రవికుమార్ తన తండ్రి కొప్పుల వెంకన్న జ్ఞాపకార్థం రూ.12 వేల విలువైన 33 ఇంచుల ఎల్ఈడీ టీవీని మంగళవారం బలపాల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కే నరసింహారెడ్డి, గుండ్రాతిమడుగు కాంప్లెక్స్ సీఆర్పీ ఉమల సమక్షంలో హెచ్ఎం సునీతకు అందజేశారు. రవికుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొర్రూరు, నవంబర్ 12: ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నేటికీ హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండర్ చైర్మన్ పరిపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆయనను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తొర్రూరు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి, గెలిచిన వెంటనే ఒక్క హామీని కూడా పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్నా, ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీలోని నాయకుల చుట్టూ తిరగడం, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం తప్ప అభివృద్ధిపై ఆలోచన లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో తొర్రూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమండ్ల ప్రదీప్‌రెడ్డి, నాయకులు భూపతి, జంపన్న, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలునాయక్, రాజు, అరుణ్‌నాయక్, సురేశ్‌నాయక్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: మండలంలోని జమాండ్లపల్లి హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా కుటుంబ సర్వే పేరుతో నూతన మోసాలు జరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్‌క్రైం జరిగితే వెంటనే 1930టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, సంపత్, అశోక్, బాపూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దంతాలపల్లి, నవంబర్ 12: మండలంలోని పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, రేపోణి, రామనుజపురం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై తొర్రూరు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. 46 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఆరుగురిని బైండోవర్ చేసి ఒక బైక్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై తిరపతి తెలిపారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడి మేకల కుమార్, ప్రధా న కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షురాలుగా సౌభాగ్య, కోశాధికారిగా సోమేశ్వరరా వు, ఆడిటర్‌గా ఎండీ షబ్బీర్, కార్యదర్శులుగా భరత్ కుమార్, రామ్, సునీతను జి ల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, హరి నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యాపారులు సహకరించాలి

కురవి, నవంబర్ 12: కురవి వీరభద్ర స్వామి ఆలయ పవిత్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎస్సై గండ్రాతి సతీశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వ్యాపారులు రోడ్డుకు పోలీసులు సూచించిన మార్కు వరకు తమ షాపులను వెనక్కి జరపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సదయ్య పాల్గొన్నారు.

'పంచదాయి వృత్తుల వారిని ఒకే కులంగా గుర్తించాలి'

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: పంచదాయి వృత్తుల వారందరిని ఒకే కులంగా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కోశాధికారి మోత్కూరి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో సైతం నమోదు చేయాలన్నారు. కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిలాశిల్పం, స్వర్ణకారులను విశ్వబ్రాహ్మణులుగా గుర్తించాలని, రిజర్వేషన్ పరంగా న్యాయం చేయాలన్నారు.

టీపీటీఎఫ్ కమిటీల్లో పెద్దవంగర టీచర్లు..

ఐలయ్య

రవీందర్‌రెడ్డి

పెద్దవంగర, నవంబర్12: టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో పెద్దవంగర మండల టీచర్లకు స్థానం కల్పించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కమిటీలు ఎన్నుకున్నామని మండల అధ్యక్షుడు చిక్కాల సతీశ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సోమారపు ఐలయ్య 25 ఏండ్లుగా టీపీటీఎఫ్‌లో మండల, జిల్లాస్థాయి నాయకత్వంలో పనిచేస్తూ సంఘ నిర్మాణంలో టీచర్లు, విద్యారంగ సమస్యల సాధనలో క్రియాశీలకంగా పని చేశారన్నారు. ఈ క్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా, సీనియర్ కార్యకర్తగా ఉంటూ సంఘం కోసం పనిచేస్తున్న పెండ్లి రవీందర్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. తమ ఎన్నికకు సహకరించిన మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు పెద్దవంగర మండల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నర్సింహులపేట, నవంబర్ 12: ఇసుక ట్రాక్టర్ ఓనర్ రెవెన్యూ సిబ్బందిని బెదిరించిన విషయంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని కౌలస్యదేవిపల్లి శివారు ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో తహసీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని బెదిరించారని ఆర్ఐ అఖిల్ ఫిర్యాదు చేశారు. దీంతో రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: జిల్లాలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన టీజీవో కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ప్రసాద్, సరేశ్, రాజశేఖర్, నరేశ్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాకమ్మకు ఉత్తమ గ్రంథ పురస్కారం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: మానుకోట పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు కవి, రచయిత్రి తాళ్లపల్లి యాకమ్మకు నవల విభాగంలో మంగళవారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆమె రాసిన 'కెరటం' నవలకు ఉత్తమ గ్రంథ పురస్కారం అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కేవీ రమణాచారి యాకమ్మకు పురస్కారం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రావు, వెంకన్న, కవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండ గట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో 14వ వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ పాలనపై తీవ్ర అసంతృప్తి, పదేళ్లలో నిరుద్యోగం, పేదరికం విపరీతంగా పెరిగిందన్నారు. విద్య, వైద్యం కొనుకునే పరిస్థితుల్లో ఉందన్నారు. బీజేపీ మతోన్మాద విధానాల వల్ల దేశంలో అరాచక పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. సమావేశంలో సాదుల శ్రీనివాస్, సూర్ణపు సోమయ్య, రాజమౌళి పాల్గొన్నారు.

నకిలీ వరి విత్తనాలతో రైతన్నకు నష్టం

నర్సింహులపేట, నవంబర్ 12: భారీ వర్షాలతో నష్టపోయిన రైతన్నను నకిలీ విత్తనాలు మరింత ఆగం చేస్తున్నాయి. మండలంలోని రామన్నగూడేనికి చెందిన రైతులు మండల కేంద్రంలోని భారతి ట్రేడర్స్‌లో(యశోద సీడ్స్) చెందిన జై శ్రీరాం విత్తనంతో వరి సాగు చేశారు. చేతికి వచ్చే సమయానికి వేర్వేరు విత్తనాలకు చెందిన వరి కంకులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన కొండ్రెండి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు రైతులు సుమారు 10 ఎకరాల్లో జైశ్రీరాంకు చెందిన వరి విత్తనాలు తీసుకొచ్చి నారు పోసి నాటు వేశాడు. ప్రస్తుతం కోత దశలో వేర్వేరు విత్తనాలు(బెరుకు) రావడంతో కొంత పొలం కంకులు రాగ, మరికొంత పాలు పోసుకునే దశలో ఉండడంతో రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారికి సమాచారం అందించినా ఫలితం లేదని, విత్తన షాపు, కంపెనీకి చెందిన వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 10 ఎకరాల వరకు నష్టపోయామని, వీటితో పాటు మరి కొన్ని దుకాణాల్లో వరి విత్తనాలు తీసుకున్న రైతులు సైతం మోసపోయారని తెలిపారు. వ్యవసాయ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతు కొనుగోలు చేసి తీసుకున్న రశీదు

నకిలీ విత్తనాలతో నష్టపోయా

జైశ్రీరాం వరి విత్తనాలను తీసుకొచ్చి నారుపోసి నాటు వేశాను. ప్రస్తుతం కోత దశలో (బెరుకులు) కనిపించడంతో విత్తన షాపు యజమానిని అడిగితే పట్టించుకోవడం లేదు. కంపెనీవారు రావడం లేదని చెబుతున్నాడు. నకిలీ విత్తనాలు ఇచ్చిన వారిపై చర్య తీసుకొని మాకు న్యాయం చేయాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, రైతు, రామన్నగూడెం

నకిలీ విత్తనం(బెరుకులు)తో పైరు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో నర్మద

డోర్నకల్, నవంబర్ 12: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఈవో నర్మద అన్నారు. మంగళవారం సీరోలు మండలం మన్నెగూడెంలో సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించి మాట్లాడారు. సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలని, కుటుంబ సభ్యులు, ఇతర వివరాలను స్పష్టంగా తెలుపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గురు స్వామి పాల్గొన్నారు.

టీవీవీ ఏపీవీ యూనియన్ లీగల్ అడ్వైజర్‌గా వినోద్

కొత్తగూడ, నవంబర్ 12: మండలంలోని ఎదుళ్లపల్లి వ్యవసాయ విస్తరణాధికారి జీ వినోద్, తెలంగాణ నూతన వ్యవసాయ విస్తరణాధికారుల ఐక్య వేదిక (టీవీవీఏవీ) యూనియన్‌కు లీగల్ అడ్వైజర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హోరాహోరీగా జోనల్‌స్థాయి క్రీడాపోటీలు

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మరిపెడ, నవంబర్ 12: మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జోనల్‌స్థాయి స్పోర్ట్స్‌మీట్ మంగళవారం కొనసాగింది. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షాట్‌పుట్, చెస్, క్యారం, టెన్నీకాయిడ్ తదితర ఆటల్లో వివిధ పాఠశాలల క్రీడాకారులు హోరాహోరీగా తలబడ్డారు. ఈ సందర్భంగా జోనల్ అధికారి స్వరూపారాణి క్రీడలను పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.